
సాక్షి కృష్ణాజిల్లా

గురువారం । 9 । జనవరి । 2025



రసవత్తరంగా వాలీబాల్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. బుధవారం ప్రీక్వార్టర్స్‌లో జట్లు తలపడ్డాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం బుధవారం 566.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.



మేధాశక్తిని ప్రదర్శించాలి

పెనమలూరు: వైజ్ఞానిక ప్రదర్శనలను వేదికగా విద్యార్థులు తమ మేధాశక్తిని ప్రదర్శించాలని సమగ్ర శిక్ష స్టేట్ పీడీ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం ముగిసింది

న్యూస్‌రీల్

క్యాలెండర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ ఆర్అండ్‌బీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్‌ను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేవీ శివారెడ్డి, ఎ. విద్యాసాగర్ లాంఛనంగా ఆవిష్కరించారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఆర్అండ్‌బీ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఎన్జీఓ నేతలు శివారెడ్డి, విద్యాసాగర్‌లను ఘనంగా సత్కరించారు. ఆర్అండ్‌బీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి. మునికేశవులు, జనరల్ సెక్రటరీ జి. రామమోహన్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్వీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి. చైతన్య, కోశాధికారి పీఎస్‌వీ సత్యనారాయణలతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు



చిలకలపూడి(మచిలీపట్నం): పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బుధవారం పెడన శాసన సభ్యుడు కాగిత కృష్ణప్రసాద్, పెడన కలంకారీ ఆర్టిజాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్‌ను కలిసి పెడనలో ఏర్పాటు చేయనున్న కలంకారీ క్లస్టర్ గురించి చర్చించారు. పెడన మునిసిపల్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, అసోసియేషన్ ప్రతినిధులు బళ్ల ప్రసాద్, జంపాన శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ గోపాలరావు, తహసీల్దార్ కె. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంచి కుటుంబాలతో మంచి సమాజం



ఉంగుటూరు: కుటుంబ జీవితం ఎంతో విలువైనదని, మంచి కుటుంబాలే మంచి సమాజానికి నాంది అని హైదరాబాద్ సోషల్ సర్వీసు సెంటర్ డైరెక్టర్ ఫాదర్ మాదాను అంథోని అన్నారు. ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు బుధవారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా దివ్యపూజా బలిని సమర్పించి, క్రైస్తవ కుటుంబ జీవితం గురించి బోధించారు. నేటి పరిస్థితులలో కుటుంబ జీవితం ఎంతో విలువైందని అందరూ ఐక్యంగా జీవించాలని సూచించారు. బైబిలులో ఎన్నో ఆదర్శ కుటుంబాలు ఉన్నాయని, ముఖ్యంగా తిరుకుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని జీవించాలని తెలిపారు. వేళాంగిణి నగర్ సంఘస్తులు, సెయింట్ ఆన్స్ సిస్టర్ కొనియాడారు. పూజానంతరం పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు, విచారణ గురువులు అభిలాష్ గోప్ప, ఆంథోని ఫాదర్‌ను ఘనంగా సన్మానించారు.

రేపటి నుంచి ప్రాపర్టీ షో

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రెడాయ్ విజయవాడ చాప్టర్ 10వ ప్రాపర్టీ షో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ చాప్టర్ అధ్యక్షుడు డి. రాంబాబు తెలిపారు. బృందావనకాలనీలో ఏ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ ప్రాపర్టీ షోలో నిర్మాణరంగ సంస్థలతో 50 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డి. రాంబాబు మాట్లాడారు.



మోపిదేవిలో 22ఏ కింద ఉన్న భూములు(ఫైల్)

ఫ్రీ హోల్డ్ సక్రమమే!

- అసైన్డ్ భూములపై విచారణ పూర్తి
- 523.82 ఎకరాలు సక్రమమే అని తేల్చిన సర్కారు
- పలు అభ్యంతరాలతో డీవియేషన్‌లో 158 ఎకరాలు
- జిల్లాలో 682.54 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

సాక్షి, మచిలీపట్నం: నేల తల్లిని నమ్ముకున్న అన్నదాతల అసైన్డ్ భూములను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ చేసి అభయమిచ్చింది. ఏళ్ల తరబడి సాగు అనుభవంలో ఉన్న భూములపై గత ప్రభుత్వం సంపూర్ణ హక్కులు కల్పిస్తే.. అది జీర్ణించుకోలేని కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక 22-ఏ అసైన్డ్ పేరుతో హోల్డ్‌లో ఉంచింది. దీనిపై రెవెన్యూ అధికారులతో విచారణ జరిపించింది. తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెవెన్యూ బృందాలతో క్షేత్ర స్థాయిలో విచారణ చేయించింది. నాలుగైదు నెలల పాటు దీనిపై కసరత్తు చేసి, చివరకు 77 శాతానికి పైగా భూములు సక్రమమే అని తేల్చింది. మిగిలిన 23 శాతం భూములు 20 ఏళ్ల కాలేదని, కొన్ని అభ్యంతరాలు రావడంతో ప్రస్తుతం డీవియేషన్ కింద నమోదు చేసింది. అయితే అత్యధిక శాతం ఫ్రీ హోల్డ్ భూములన్నీ సక్రమమే అని తేల్చడంతో జిల్లాలోని 810 మంది రైతుల్లో ఆనందం నెలకొంది.

పేద రైతులకు ఇస్తే.. ఓర్వలేక..

అనుభవంలో ఉన్న పేద రైతులకు అసైన్డ్ భూములపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ చేసి సంపూర్ణ హక్కులు కల్పించింది. దీనిని కూటమి సర్కారు ఓర్వలేకపోయింది. వాటిని హోల్డ్‌లో పెట్టి రెవెన్యూ అధికారులతో విచారణ చేయించింది. నెలల తరబడి విచారణ జరిపి.. పలు అభ్యంతరాలతో 158 ఎకరాలను డీవియేషన్‌గా పేర్కొంది. అది కూడా కేవలం గన్నవరం, బాపులపాడు మండలాల్లో 20 ఏళ్ల అనుభవం పూర్తి కాని కారణంగా, ప్రస్తుతం అనుభవంలో వేరే వాళ్లు ఉన్నారనే అభ్యంతరాలతో డీవియేషన్‌లో పెట్టింది. మిగిలిన 23 మండలాల్లో ఒక సెంటు కూడా అన్యాయంగా.. అక్రమంగా ఫ్రీ హోల్డ్ ప్రకటించలేదని కూటమి సర్కారే తేల్చినట్లు అయ్యింది.

'అసైన్డ్' అన్నదాతలకు ఊరట

సంపూర్ణ హక్కు..

పేద రైతులకు డీ-పట్టాలు, అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వడం, ఆన్‌లైన్, అడంగల్‌లో పేర్లను నమోదు చేసి, సాగు చేసుకోవడానికి ప్రభుత్వాలు అవకాశం కల్పించాయి. కానీ వాటిపై పూర్తి హక్కు కల్పించలేదు. దీంతో ఆపద, అత్యవసర వేళ వాటిని బ్యాంకుల్లో తనఖా, కుదువ పెట్టడం, అమ్ముకోవడానికి హక్కులు ఉండవు. వీటిపై తమకు హక్కులు కల్పించాలని రైతులు గత ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. దీంతో నాటి సీఎం వైఎస్ జగన్ అసైన్డ్ చట్టాన్ని సవరించి, 2023 ఆగస్టు నాటికి 20 ఏళ్ల అనుభవంలోని రైతులకు భూములపై సంపూర్ణ హక్కులు కల్పించారు.

ఏటా ఫ్రీ హోల్డ్ చేయాలని..

గత ప్రభుత్వం ఏటా ఫ్రీ హోల్డ్ చేయాలనే ఆలోచనతో చట్ట సవరణ చేసింది. మొదటి దశలో 2003 ఆగస్టు నుంచి 2023 ఆగస్టు వరకు (20 ఏళ్లు) అనుభవంలో ఉన్న రైతులకు హక్కులు కల్పించింది. 2024 ఆగస్టులో రెండో దశ, 2025 ఆగస్టులో మూడో దశ.. ఇలా ఏటా ఆగస్టులో 20 ఏళ్ల అనుభవదారులకు హక్కులు కల్పించాలని సంకల్పించింది. కానీ కూటమి ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ పూర్తయింది. జిల్లాలో 682.54 ఎకరాల అసైన్‌మెంట్ భూములపై విచారణ చేయగా 158.72 ఎకరాలు డీవియేషన్స్ కింద ఉన్నాయి. ఇందులో 20 ఏళ్ల అనుభవం పూర్తి కానివి, ఇతరులు సాగు చేస్తున్నట్లు అభ్యంతరాలు కావడంతో డీవియేషన్ కింద ఉంచాం. ఆన్‌లైన్, ఇతర ప్రక్రియ పూర్తి పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.

– డీకే బాలాజీ, కలెక్టర్, కృష్ణాజిల్లా

682 ఎకరాలపై విచారణ..

జిల్లాలోని 25 మండలాల్లో 682.54 ఎకరాల ఫ్రీ హోల్డ్‌ను చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చాక హోల్డ్ చేసింది. తహసీల్దార్ల ఆధ్వర్యంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో విచారణ చేయగా 23 మండలాల్లోని 523.82 ఎకరాలు సక్రమంగానే ఉన్నట్లు తేల్చారు. కేవలం గన్నవరంలోని 30.84, బాపులపాడులోని 158.72 ఎకరాలపై వచ్చిన అభ్యంతరాలతో డీవియేషన్‌లో ఉంచారు. ఆ భూముల్లోనూ అధిక శాతం సాగు అనుభవం 20 ఏళ్లు దాటని భూములు. 20 ఏళ్లు దాటితే అవి కూడా ఫ్రీ హోల్డ్ అవుతాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు. దీనిని బట్టి జిల్లాలో నిబంధనలకు మేరకే ఫ్రీ హోల్డ్ చేసినట్లు స్పష్టమవుతోంది.

జర్నలిజం ధ్రువతార మానికొండ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సుప్రసిద్ధి పాత్రికేయుడు మానికొండ చలపతిరావు భారతీయ జర్నలిజంలో ధ్రువతారగా నిలిచిపోతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా సీనియర్ జర్నలిస్టు ఆకుల అమరయ్య రచించిన 'భారతీయ జర్నలిజంలో ధ్రువతార మానికొండ చలపతిరావు' పుస్తకావిష్కరణ సభ బుధవారం సాయంత్రం ప్రధాన వేదికపై జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కె. రామకృష్ణ ఇతర అతిథులతో కలిసి పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రముఖ పత్రిక నేషనల్ హెరాల్డ్‌లో సంపాదకుడిగా ఉంటూ నెహ్రూ వంటి వ్యక్తులతో నిరంతరం వివిధ అంశాలపై చర్చించిన ఘనత మానికొండ చలపతిరావుదన్నారు. మానికొండ స్మృతి చిహ్నాన్ని రాజధానిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన శరత్‌చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా పాలకవర్గాల మీద కాకుండా, సమాజం మీద అమిత ప్రేమ ఉన్న జర్నలిస్టును నేటి తరానికి పరిచయం చేయడం ముదావహమన్నారు. రచయిత ఆకుల అమరయ్య మాట్లాడుతూ 28 వ్యాసాలతో తీసుకొచ్చిన ఈ పుస్తకం మానికొండ చలపతిరావును చాలా స్వల్పంగానే ఆవిష్కరిస్తుందన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రజాశక్తి బుక్‌హౌస్ పూర్వ సంపాదకుడు ఎస్. వెంకట్రావు తదితరులు ప్రసంగించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామకృష్ణ తదితరులు

మతోన్మాదం రాజకీయాలను శాసిస్తోంది..

మతోన్మాదం దేశ రాజకీయాలను శాసిస్తోందని సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. వ్యవసాయాన్ని సైతం రాజకీయాలే ప్రభావితం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా వి. రాంభూపాల్ రచించి.. ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు', 'అసమానతలు-ఆర్థిక విధానాలు', 'విద్వేష రాజకీయాలు' పుస్తకాలను రాఘవులు బుధవారం సాయంత్రం ప్రధాన వేదికపై జరిగిన సభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ప్రపంచంలో చాలా దేశాలకన్నా ఎక్కువగా భారతదేశంలో అసమానతలు ఎక్కువగా ఉండటం బాధాకరమన్నారు. 1991లో ప్రార్థనా మందిరాలకు ఒక చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. కానీ ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో దానిని పక్కన పెట్టి కొన్ని పార్టీలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

ఎనిమిదో రోజు కొనసాగిన పోలీస్ సెలక్షన్స్

కోనేరుసెంటర్: జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో బుధవారం పోలీస్ సెలక్షన్స్ కొనసాగాయి. ఎనిమిదో రోజు 600 మంది అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపగా 273 మంది అభ్యర్థులు సెలక్షన్స్‌కు హాజరయ్యారు. కాగా వీరిలో 201 మంది అభ్యర్థులు సెలక్షన్స్‌లో ఎంపిక అయ్యారు. తొలుత ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ టెస్టులు నిర్వహించిన అధికారులు తర్వాత 100 మీటర్లు, 1600 మీటర్లు, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అభ్యర్థులతో మాట్లాడి సెలక్షన్స్‌కు వెళ్లే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే అభ్యర్థులు నీరసించకుండా అవసరమైన గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పండ్లు తీసుకోవాలని సూచించారు.



అభ్యర్థులకు సూచనలు, సలహాలు ఇస్తున్న ఎస్పీ గంగాధరరావు

ఇసుక దోపిడీపై కార్మికుల కన్నెర్ర



తోట్లవల్లూరు రేవులో బైఠాయించి ఆందోళనకు దిగిన కార్మికులు

- నార్తువల్లూరు రీచ్‌లో యంత్రాలతో లోడింగ్‌పై ఆందోళన
- తోట్లవల్లూరు రేవులో బైఠాయించి నిరసన
- ఉపాధి కల్పించి న్యాయం చేయాలని డిమాండ్

తోట్లవల్లూరు: ఇసుక క్వారీలో యంత్రాలతో సాగుతున్న ఇసుక దోపిడీపై కార్మికులు కన్నెర్ర చేశారు. తమకు ఉపాధి లేకుండా చేసి, ఇసుక మాఫియా ముసుగులో కూటమి నాయకులు సాగిస్తున్న దందాపై భగ్గుమన్నారు. క్వారీ యాజమాన్యం తీరును నిరసిస్తూ తొట్లవల్లూరు వద్ద కృష్ణానది రేవులోని బాటపై ఇసుకలారీని అడ్డుకుని కార్మికులు బుధవారం ఉదయం ఆందోళన చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నార్తువల్లూరు ఇసుక క్వారీలో యంత్రాలతో లారీలకు లోడింగ్ జరుపుతున్నారని, దీని వల్ల తమకు పని లేకుండా పోతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు కృష్ణానది పాయలోని బాటపైనే బైఠాయించారు.

మా పొట్ట కొట్టొద్దు..

ఇసుక క్వారీలో యంత్రాలతో లోడింగ్ చేస్తూ తమ పొట్ట కొట్టొద్దని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం క్వారీలో కార్మికుల ద్వారానే లోడింగ్ జరగాలని, కానీ నార్తువల్లూరు క్వారీలో యాజమాన్యం తమకు అవకాశం ఇవ్వకుండా యంత్రాలతో లారీలకు ఇసుకను లోడింగ్ చేస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం చెప్పేదొకటి, క్షేత్రస్థాయిలో జరిగేదొకటి అని ఆరోపిస్తున్నారు.

స్పందించని అధికారులు..

ఇసుక కార్మికులు తమకు ఉపాధి కల్పించాలని ఉదయం నుంచి మండుటెండలో ఆందోళన జరుపుతున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఎస్ఐ అర్జునరాజు మాత్రం కార్మికులతో పలు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తహసీల్దార్ కుసుమకుమారికి వినతిపత్రం ఇద్దామని ప్రయత్నిస్తే, ఆమె తీసుకోవటానికి కూడా నిరాకరించారని కార్మికులు అంటున్నారు. క్వారీ నిర్వాహకులు వచ్చి తమతో చర్చలు జరిపితేనే ఆందోళన విరమిస్తామని తెగేసి చెబుతున్నారు.

కార్మికులకు తీరని నష్టం..



నార్తువల్లూరు క్వారీలో ఇసుకను యంత్రాలతో లారీలకు లోడింగ్ జరపటం వల్ల కార్మికులకు తీరని నష్టం వాటిల్లుతోంది. క్వారీలో లోడింగ్‌కు కార్మికులకు అవకాశం కల్పించి, డంపింగ్ యార్డులో యంత్రాలను వినియోగిస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

– రాము, కార్మికుడు, తోట్లవల్లూరు

గీతన్నకు చంద్రన్న టోపీ!

పది శాతం మద్యం దుకాణాల హామీ నీటిమూటేనా?

- కల్లు గీత కార్మికులకిచ్చిన హామీని పట్టించుకోని సర్కారు
- జిల్లాలో ఇప్పటికే 123 ప్రైవేట్ మద్యం దుకాణాలు
- హామీ ప్రకారం 12 షాపులు వీరికే దక్కాలి
- కానీ తమ్ముళ్లకే పెద్ద పీట వేస్తూ కేటాయింపులు
- జిల్లాలో 4,029 మంది గీత కార్మికులు

'తమ్ముళ్లూ మేం అధికారంలోకి వస్తే.. మీ తలరాతే మార్చేస్తాం. మేం తీసుకొచ్చే కొత్త మద్యం పాలసీలో పది శాతం దుకాణాలను మీకే కేటాయిస్తాం' అంటూ చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో గీత కార్మికులకు హామీ ఇచ్చారు. కానీ నేడు అధికారంలోకి వచ్చాక ఆ మాటను మరిచిపోయారు. కొత్త మద్యం పాలసీ వచ్చింది. దుకాణాలను తెలుగు తమ్ముళ్లు పంచేసుకున్నారు. ఆదాయం కూడా మెండుగా ఆర్జిస్తున్నారు. అయితే గీత కార్మికులకు దుకాణాల కేటాయింపు హామీ మాత్రం అటకెక్కింది.

గుడ్లవల్లేరు: కూటమి నేతలు కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో పది శాతం రిజర్వేషన్ అంశాన్ని గాలికి వదిలేశారు. అలాగని అసలు మద్యం దుకాణాలే పెట్టలేదా? అంటే బ్రహ్మాండంగా కూటమి నేతలకు ఉపాధి చూపించి వందల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. పాపం గీత కార్మికులు తమ రాత మారుతుందేమోనని గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 4,029మంది గీత కార్మికులు ఉన్నారు.

గీత కార్మికులపై చిన్నచూపు..

అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేయటమే లక్ష్యంగా కూటమి సర్కార్ మ్యానిఫెస్టో కనిపిస్తోంది. ఇందులో కల్లు గీత కార్మికులను సైతం వరాలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాల్లో పది శాతం షాపులను కల్లుగీత కార్మికులకు రిజర్వు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రైవేట్ మద్యం దుకాణాలను తెరిచేశారు. అక్టోబరు 15వ తేదీన తెరిచిన మద్యం దుకాణాల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. దరఖాస్తుల విక్రయాలు, నాన్ రిఫండ్‌బుల్ డిపాజిట్లు, త్రైమాసిక లైసెన్సుల ఫీజుల రూపంలో వందల కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం ఆర్జించింది. మొన్నటికి మొన్న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు నగరాల్లో ప్రీమియం మద్యం అవుట్‌లెట్ల కోసం నోటిఫికేషన్ కూడా ఇచ్చిన ప్రభుత్వానికి కల్లు గీత కార్మికులకు దుకాణాలను ఇస్తామన్న హామీ మాత్రం ఎందుకు గుర్తుకు రాలేదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు





తమ్ముళ్లు బాగుంటే చాలా?

మద్యం దుకాణాలను దక్కించుకున్న వారిలో 90శాతం మంది టీడీపీకి చెందిన వారే. పైగా లైసెన్సులు తీసుకున్న వారి నుంచి ప్రతి నియోజకవర్గంలోని కూటమి పార్టీకి చెందిన ప్రధాన నాయకులకు వాటాలు తప్పనిసరిగా అందుతున్నాయి. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు, వాటాలు తీసుకుంటున్న నాయకులు అందరూ బాగానే ఉన్నారు. కాని కల్లు గీత కార్మికుల బాగోగులు పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.

హామీ ప్రకారం..

జిల్లాలో 123మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులను మంజూరు చేసింది. మ్యానిఫెస్టో ప్రకారం గీత కార్మికులకు పది శాతం దుకాణాలను ఇవ్వాలి. అంటే ఆ లెక్కన కల్లు గీత కార్మికులకు 12దుకాణాలను కేటాయించాలి. ప్రైవేట్ దుకాణాల కేటాయింపునకు తీసుకున్నట్లు ఒక్కో దరఖాస్తు కోసం రూ.2లక్షలు నాన్ రిఫండ్‌బుల్ తీసుకుంటారా? లైసెన్సు ఫీజు రూ.55లక్షల నుంచి రూ.65లక్షల మధ్యలో ఉంచుతారా? ఏమైనా తగ్గిస్తారా? అనే ప్రశ్నలను గీత కార్మికులు సంధిస్తున్నారు. కానీ ఇప్పటివరకు ఎవరి వద్ద సమాధానాలు లేవు. ప్రైవేట్ మద్యం దుకాణాలకు ఇచ్చిన రెండేళ్ల లైసెన్సు కాల పరిమితిలో ఇప్పటికే మూడు నెలలు కావస్తోంది. అంటే గీత కార్మికులు ఈ మూడు నెలల ఆదాయాన్ని కోల్పోయినట్లే అవుతుంది. అసలు నోటిఫికేషన్ ఎప్పటికి ఇస్తారు. ఇస్తే కనుక క్షేత్ర స్థాయిలో నిజమైన గీత కార్మికులకు దుకాణాలను ఇస్తారా? లేదా ఆ ముసుగులో ఉన్న టీడీపీ కార్యకర్తలకు దుకాణాలను కట్టబెడతారా? అన్న అంశం అర్థం కావటం లేదని పలువురు గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నీలిపూడి అంగన్‌వాడీ కేంద్రం ముందు పరుచుకున్న పచ్చదనం

అంగన్‌వాడీ.. హరిత లోగిలి

కృత్తివెన్ను: ఎటు చూసినా పచ్చదనం. అందమైన పూల మొక్కలు, కావాల్సిన కూరగాయలు, ఆరోగ్యాన్నిచ్చే ఆకుకూరలు.. వీటి నడుమ ఆహ్లాదకరంగా సాగుతుంది అంగన్‌వాడీ కేంద్రం. తమ కేంద్రానికి వచ్చే ప్రీ స్కూల్ పిల్లలకు కలుషితం కాని నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్న ఆలోచన అంగన్‌వాడీ కార్యకర్త పాశం మామిళ్లమ్మకు వచ్చింది. ఇంకేముంది అనుకున్నదే తడవుగా తన ఆలోచనను ఆచరణలోకి తీసుకువచ్చింది. కృత్తివెన్ను మండలం నీలిపూడి అంగన్‌వాడీ కేంద్రం-2 ప్రాంగణంలో రకరకాల మొక్కలతో పచ్చదనం పరుచుకుంది. తమ పిల్లల భోజనానికి కావాల్సిన ఆకుకూరలైన తోటకూర, గోంగూర, మెంతికూర, బచ్చలి, పాలకూరలతో పాటు వంగ, బెండ, చిక్కుడు కూరగాయల మొక్కలు, రకరకాల పువ్వుల మొక్కలను నాటి సంరక్షించడం మొదలు పెట్టారు. వారి కష్టం ఫలించింది.. కొన్ని నెలల నుంచి వారు వీటి నుంచి భోజనం లోకి కావాల్సిన కూరలు తయారు చేసుకుంటూ, గర్భిణులు, బాలింతలకు సైతం ఆకుకూరలను అందిస్తున్నారు. ఎటువంటి రసాయనిక ఎరువులు లేకుండా సేంద్రియ ఎరువులతోనే వీటిని పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

చుట్టూ పచ్చందాలతో ఆహ్లాదకర వాతావరణం

ఈ సమస్యలు పరిష్కరించండి..

అంగన్‌వాడీ కేంద్రంలోని టాయిలెట్స్‌లో రన్నింగ్ వాటర్ సౌకర్యం లేదు, సెంటర్ చుట్టూ కాంపౌండ్ వాల్ కొరత ఉన్నాయి. పాలకులు వీటిపై దృష్టి సారించి పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

రేపు విజయవాడలో జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 10వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బెంజ్‌సర్కిల్ సమీపంలో రమేష్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఎస్సీ, ఫుడ్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేసిన 24 నుంచి 30 సంవత్సరాల లోపు అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులని చెప్పారు. ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు విద్యార్హత పత్రాల ఒరిజినల్స్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్‌లతో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 93477 79032 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నూతన ఆవిష్కరణలతో మేధాశక్తిని ప్రదర్శించాలి



పెనమలూరు: వైజ్ఞానిక ప్రదర్శనలను వేదికగా చేసుకొని నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు మేధాశక్తిని ప్రదర్శించాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస్ చెప్పారు. ఏపీ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పోరంకిలో బుధవారం రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో స్టెమ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ప్రావీణ్యత సాధించే విధంగా చర్యలు చేపడతామన్నారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 26 జిల్లాల నుంచి 3 విభాగాలైన వ్యక్తిగత, టీమ్ విభాగం, ఉపాధ్యాయ విభాగంలో మొత్తం 156 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో 15, టీమ్ విభాగంలో 10, ఉపాధ్యాయ విభాగంలో 10 అత్యున్నత ప్రాజెక్టులు ఎంపిక చేశామని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరగనున్న దక్షిణ భారత దేశ విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ప్రదర్శనలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

సోలార్ పెట్టు.. రూ.కోటి పట్టు

- గ్రామమంతా సోలార్ విద్యుత్ వినియోగిస్తే రూ.కోటి నజరానా
- గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆఫర్
- జిల్లాలో ఎనిమిది మోడల్ సోలార్ గ్రామాల ఎంపిక



ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్(ఫైల్)

గుడ్లవల్లేరు: ఆక్సిజన్‌తో సమానంగా అత్యవసరమైన విద్యుత్ వాడకాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని అమల్లోకి తెచ్చింది. కేవలం విద్యుత్ వినియోగంలోనే గాక ప్రకృతిలో కాలుష్య నివారణలో భాగంగా పర్యావరణ పరిరక్షణ చేసుకునేందుకు ఈ పథకం దోహదపడుతుంది. ఈ పథకం అమల్లో భాగంగా ఆర్థిక ప్రోత్సాహకాలను కూడా కేంద్రం ఇస్తోంది. నిర్దేశిత లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పల్లెలు, పట్టణాల్లో ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు లబ్ధిదారులకు రాయితీలను ప్రకటించారు. దేశ వ్యాప్తంగా జిల్లాల పరిధిలో నియోజవర్గాల వారీగా 5 వేలకు పైగా జనాభా కలిగిన పంచాయతీల్లో మోడల్ సోలార్ గ్రామాలను ఎంపిక చేశారు. ఒక కిలో వాట్ నుంచి మూడు కిలోవాట్ల వరకు సోలార్ ప్యానెల్స్‌ను అమర్చుకున్న లబ్ధిదారులకు రూ.30 వేలు, రూ.60 వేలు, రూ.78 వేల చొప్పున రాయితీని కేంద్రం అందించేందుకు ఉత్తర్వులను జారీ చేసింది. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటులో పోటీ పరిస్థితుల్లో జిల్లాల వారీగా అత్యధికంగా లక్ష్యం సాధించిన పంచాయతీ ఖజానాకు రూ.కోటి నగదు నజరానాను జమ చేసేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. ఈ పథకంపై ఎంపిక కాబడిన మోడల్ గ్రామాల్లోని స్థానికులకు అవగాహనా సదస్సులను కూడా విద్యుత్ అధికారులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఎనిమిది సోలార్ మోడల్ గ్రామాలు ఎంపిక చేశారు. ఆతుకూరు, వేలేరు, నిడమానూరు, పి.వి.పల్లి, వెంట్రప్రగడ, కె.ఎస్.ఎన్.పాలెం, కందలంపాడు, యార్లగడ్డ గ్రామాలను కేంద్రం ఎంపిక చేసింది.

రూ.కోటి నజరానాతో అభివృద్ధికి మేలు...

జిల్లాలో 5 వేలకు పైగా జనాభా కలిగిన ఆయా పంచాయతీల వారీగా పోటీ దృష్ట్యా సౌర ఫలకాల ఏర్పాటులో అత్యధికంగా ఫలితాలను సాధించాలి. అప్పుడే విజేతగా నిలిచిన పంచాయతీ ఖజానాకు కోటి రూపాయలను కేంద్ర ప్రభుత్వం నగదు బహుమతిని అందిస్తుంది. ఈ నిధులను వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకునే సౌలభ్యం ఉంటుంది. వ్యక్తిగతంగా విద్యుత్ బిల్లు తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరంగా ప్రయోజనాలను నిర్దేశించారు. మిగులు విద్యుత్ గ్రిడ్‌లోకి ఎన్ని యూనిట్లు వెళ్లిందో ఆ మేరకు డబ్బు తిరిగి వినియోగదారులకు జమ అవుతుంది. నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టింది. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగానికి ప్రత్యామ్నాయ మార్గాలపై కేంద్రం ఈ విధమైన పథకాలపై మరిన్ని కార్యాచరణలు చేపడుతున్నారు.

విస్తృత ప్రచారం..



సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద జిల్లాలోని ఎంపిక చేసిన సోలార్ మోడల్ గ్రామాల పరిధిలోని వినియోగదారులు తమ ఇళ్లు, భవంతులపై రాయితీతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ ద్వారా విద్యుత్ తయారీలో భాగస్వాములను చేస్తాం. ఈ పథకం వలన వచ్చే ప్రోత్సాహకాలపై అవగాహన చేసేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. ఇప్పటికే అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశాం. పంచాయతీల వారీగా దరఖాస్తులను నమోదు చేసుకున్నారు. టెండరు ప్రక్రియ ప్రకారమే గృహాలపై సోలార్ ప్యానెల్స్‌ను అమరుస్తారు. పురోగతి ఉంటే కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నిధులను నజరానా కింద విజేతలైన పంచాయతీలకే నేరుగా జమ చేస్తోంది.

– ఎం.సత్యానందం, విద్యుత్ ఎస్ఈ, మచిలీపట్నం సర్కిల్

పీఏసీఎస్‌లో నిధుల గోల్‌మాల్.. ఉద్యోగి సస్పెన్షన్



ముచ్చర్ల పీఏసీఎస్

పెడన: మండల పరిధిలోని ముచ్చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి(పీఏసీఎస్) సంఘంలో నిధులు గోల్‌మాల్ చేసిన ఘటనలో ఆ సంఘ కార్యాలయంలో సీఈఓ(చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ – గతంలో కార్యదర్శిగా పిలిచేవారు)గా విధులు నిర్వహించే చందన మధుబాబును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనలో గతేడాది నుంచి రైతులు తీసుకున్న రుణాలు రికవరీకి సంబంధించి పెడనలోని కేడీసీసీ బ్యాంకులో జమ చేయకుండా ఆ నగదును పక్కదారి పట్టించాడు. సుమారు రూ.30 లక్షలు వరకు నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లోని రుణాలు తీసుకుని తిరిగి చెల్లించిన రైతులు కొందరు గొడవకు దిగడంతో వారికి సర్దుబాటు చేసి రికవరీలను చెల్లించాడు. తిరిగి చెల్లించినా గొడవ చేయని మరికొందరు రైతులు పరిస్థితి ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏయే రైతుల నుంచి ఎంత రికవరీ చేసింది, పూర్తి వివరాలను తెలియకుండా అధికారులు గోప్యంగా ఉండటం పట్ల రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషయాన్ని బ్యాంకు ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. సదరు ఉద్యోగి తిరిగి రూ.20 లక్షలకుపైగా చెల్లించగా మిగిలిన మొత్తం ఇక చెల్లించలేనని చెప్పడంతో చేతులకు మట్టి అంటకుండా ఉండటానికి ఉన్నతాధికారులు సదరు ఉద్యోగిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. అయితే ఈ విషయమై పెడన కేడీసీసీ బ్యాంకు మేనేజర్ వి.సాయిబాబు మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా నగదు సక్రమంగా చెల్లించకపోవడంపై ఆరా తీసి పలుమార్లు నోటీసులు ఇచ్చామన్నారు. సుమారు రూ.14 లక్షలు వరకు ఉంటే రూ.6 లక్షలు కట్టారని, ఇంకా చెల్లించకపోవడంతో మధును మూడు రోజుల కిందట సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించామని తెలిపారు.

వ్యాక్సినేషన్ సక్రమంగా నిర్వహించాలి

ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని



గిరిపురం పీహెచ్‌సీలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు వేసే వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా వేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. గిరిపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో చిన్నారులకు వేస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ సెంటర్ పరిధిలో టీకాలు వేయించుకోవాల్సిన చిన్నారుల జాబితా, వ్యాక్సిన్ స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అదే విధంగా పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన సెంట్రల్ ల్యాబ్ సర్వీస్ అమలులో భాగంగా శాంపిల్ సేకరణ, రవాణా తదితర అంశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం జక్కంపూడి సచివాలయాన్ని సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలకు వంద శాతం టీకాలు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ నవీన్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుష్మా, గిరిపురం వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఇందు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీ కొని పెదనాన్న, కుమారుడు దుర్మరణం



ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు

అయ్యంకి(మొవ్వ): మొవ్వ మండలం యద్దనపూడి శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదనాన్న, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. కూచిపూడి పోలీసులు తెలిపిన వివరాలు మేరకు మొవ్వ మండలం అయ్యంకి గ్రామానికి చెందిన పడమట నాగరాజు(39), గూడూరు మండలం మల్లవోలు గ్రామానికి చెందిన పటమట పెద నాగ మునేశ్వరరావు(60)లు ద్విచక్ర వాహనంపై కూచిపూడి నుంచి అయ్యంకి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మృతుల తలకు బలమైన గాయాలు అవ్వటంతో ఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి చెందారు. వీరిద్దరు కలిసి వ్యవసాయం చేస్తుంటారు. మొవ్వ మండలం పాలంకిపాడులో బుధవారం ఉదయం మృతి చెందిన బంధువు అంత్యక్రియలకు వీరు కలిసి హాజరయ్యారు. నాగరాజుకు భార్య, మునేశ్వరరావుకి భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై పామర్రు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్(కూచిపూడి ఇన్‌చార్జి) కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు కారణమైన లారీని అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మచిలీపట్నంలో వడ్డీ వ్యాపారి హత్య

వివాహేతర సంబంధమే కారణంగా భావిస్తున్న పోలీసులు



అడపాల రవికుమార్(ఫైల్)



హత్య చేసే ముందు పెడన రోడ్డులోని ఓ బడ్డీ వద్ద మద్యం సేవిస్తున్న నిందితులు

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో ఓ వడ్డీ వ్యాపారి దారుణంగా హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు గల కారణంగా పోలీసులు భావిస్తున్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసిన చిలకలపూడి పోలీసులు హంతకుల కోసం గాలిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం చిలకలపూడికి చెందిన అడపాల రవికుమార్(50) వడ్డీ వ్యాపారం చేస్తుంటాడు. ఘంటసాలకు చెందిన టి.శ్రీను అనే లారీడ్రైవర్ రవికుమార్ వద్ద తరుచూ అప్పు తీసుకుంటూ, తిరిగి చెల్లించేవాడు. కొంతకాలంగా శ్రీను తీసుకున్న అప్పు చెల్లించకపోగా వడ్డీ సైతం కట్టడంలేదు. దీంతో రవికుమార్ వడ్డీ డబ్బుల కోసం శ్రీను ఇంటికి వెళ్తుండేవాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వివాదం జరుగుతుండేది. దీనికి తోడు శ్రీను భార్యతో రవికుమార్ చనువుగా మాట్లాడుతుండేవాడు. శ్రీను ఇంట్లో లేని సమయంలో డబ్బుల కోసం రవికుమార్ తరుచూ అతని ఇంటికి వెళ్తుండటంతో ఆగ్రహానికి గురైన శ్రీను అనేక మార్లు రవికుమార్‌తో గొడవ పడ్డాడు. అయినప్పటికీ రవికుమార్ ఇంటికి వెళ్లటం డబ్బులు అడగటం ఆపకపోవటంతో విసుగుచెందిన శ్రీను ఎలాగైనా రవికుమార్‌ను అంతమొందిచాలనుకున్నాడు.

పథకం ప్రకారమే హత్య..

రవికుమార్‌ను అంతమొందించాలనుకున్న శ్రీను డ్యూటీలో పరిచయమైన చల్లపల్లి మండలం కొత్త మాజేరుకు చెందిన స్నేహితులు(లారీ డ్రైవర్లు) వంశీ, శివలతో మాట్లాడి తనకు సహకరించాలని కోరాడు. ఈ ముగ్గురు కలిసి పెడన రోడ్డులోని కోతి బొమ్మసెంటర్‌లో ఉన్న ఓ బడ్డీకొట్టులో పూటుగా మద్యం సేవించారు. పథకం ప్రకారం శ్రీను కత్తి వెంటబెట్టుకుని మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో చిలకలపూడిలోని రవికుమార్ ఇంటి వద్ద పికెటింగ్ నిర్వహించారు. రవికుమార్ బైక్ వరండాలో లేకపోవటంతో అతను ఇంటికి రాలేదని నిర్ధారించుకున్నారు. అతన్ని హత్య చేసేందుకు నిర్ణయించుకున్న ముగ్గురు చుట్టుపక్కల ఎలాంటి ఆధారాలు లేకుండా చేసేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సీసీ కెమేరాల వైర్లను కత్తిరించారు.

చికిత్స పొందుతూ మృతి..

దాదాపు గంటకుపైగా వేచి ఉన్న శ్రీను అతని ఇద్దరు స్నేహితులకు రవికుమార్ బైక్ వస్తుండటం గమనించారు. రవికుమార్ ఇంటి ముందర ఆగి బైక్ లోపలికి తీసుకువెళ్లి స్టాండ్ వేస్తుండగా ముగ్గురు ఒక్కసారిగా కత్తితో విచక్షణారహితంగా పొడిచారు. దీంతో రవికుమార్ కాలేయం, మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కత్తిపోట్లకు రవికుమార్ బిగ్గరగా కేకలు వేయటంతో ఇంట్లో ఉన్న అతని కుమార్తె ధాత్రి తలుపులు తీసి చూస్తుండగా ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు. రవికుమార్ రక్తపు మడుగులో కనిపించాడు. తండ్రిని చూసిన కుమార్తె బిగ్గరగా ఏడుస్తుండగా ధైర్యం చెప్పిన రవికుమార్ బైక్ తీసుకుని సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. బంధువులు తలుపు తీసి చూడగా రవికుమార్ జరిగిన విషయాన్ని చెప్పి తనను ఆసుపత్రికి తీసుకువెళ్లి బతికించమని ప్రాధేయపడ్డాడు. రవికుమార్‌ను బంధువులు హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రవికుమార్ మృతి చెందాడు. జరిగిన సంఘటనపై మృతుని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ నబీ తెలిపారు.

రసవత్తరంగా జాతీయ వాలీబాల్ టోర్నీ



క్యాంప్ ఫైర్‌లో డ్యాన్స్ చేస్తున్న యువతులు



తలపడుతున్న ఆంధ్ర, కేరళ జట్టు క్రీడాకారిణులు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) అండర్–19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. ఈ నెల ఆరో తేదీన పీబీ సిద్ధార్థ కాలేజీ మైదానంలో ప్రారంభమైన ఈ టోర్నీలో దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాల జట్లు తలపడుతున్నాయి. బుధవారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో మధ్యప్రదేశ్‌పై పశ్చిమబెంగాల్(3–0), చత్తీస్‌ఘడ్‌పై తమిళనాడు(3–0), హిమాచల్‌ప్రదేశ్‌పై హర్యానా(3–0), ఒడిశాపై ఉత్తర్‌ప్రదేశ్(3–0), గుజరాత్‌పై పంజాబ్(3–1), మహారాష్ట్రపై కర్ణాటక(3–0), ఢిల్లీపై ఆంధ్రప్రదేశ్(3–0), సీఐఎస్‌సీఈపై కేరళ(3–0) గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. సాయంత్రం నుంచి ప్రారంభమైన క్వార్టర్ ఫైనల్స్‌లో పశ్చిమబెంగాల్‌పై తమిళనాడు 25–23, 25–15, 16–25, 25–14: 3–1), ఉత్తర్‌ప్రదేశ్‌పై హర్యానా(25–12, 25–23, 25–14: 3–0) తేడాతో గెలిచాయి. తమిళనాడు, హర్యానా రాష్ట్రాలు సెమీస్‌లో బెర్త్ ఖరారు చేసుకోగా, మరో కోర్టుల్లో పంజాబ్–కర్ణాటక, ఆంధ్రప్రదేశ్–కేరళ రాష్ట్రాల క్వార్టర్ ఫైనల్స్ పోరు కొనసాగింది. గురువారం సెమీస్‌లో జట్లు తలపడతాయని, ఈ నెల 10వ తేదీన జరిగే ఫైనల్స్‌లో విజేత జట్లకు ట్రోఫీలు అందజేస్తామని ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు.

దుమ్మురేపిన క్యాంప్ ఫైర్

జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్–19 బాలికల టోర్నీలో భాగంగా ఆటవిడుపుగా బుధవారం రాత్రి నిర్వహించిన క్యాంప్ ఫైర్ దుమ్మురేపింది. తొలుత ఈ కార్యక్రమాన్ని అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఏ.రమణారావు, సిద్ధార్థ విద్యాసంస్థల కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు, పోటీల కార్యనిర్వహక కార్యదర్శి రవికాంత ప్రారంభించారు. అన్ని రాష్ట్రాల క్రీడాకారులు ఈ కార్యక్రమంలో హుషారుగా పాల్గొని పలు భాష సినీ గేయాలకు డ్యాన్సులతో ప్రాంగణంలో దుమ్ము లేపారు. ఉత్సాహంగా స్టెప్పులు వేశారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

పెనమలూరు: కానూరులో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని మృతి చెందటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో నన్నపనేని రజిత భర్త వెంకటేశ్వరరావుతో(44) నివాసం ఉంటుంది. వీరికి వివాహం జరిగి 16 ఏళ్లు అయ్యింది. పిల్లలు లేరు. భర్త రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తాడు. ఈ నెల 6వ తేదీన భార్య గన్నవరం పుట్టింటికి వెళ్లగా భర్త రామవరప్పాడులో ఆమెను ఆటో ఎక్కించాడు. ఆ తరువాత భర్త మురళీనగర్ ఇంటికి చేరుకున్నాడు. అదే రోజు రాత్రి భార్య భర్తతో ఫోన్‌లో మాట్లాడింది. 7, 8వ తేదీల్లో రజిత వెంకటేశ్వరరావుకు ఫోన్ చేయగా అతను ఫోన్ లిఫ్టు చేయలేదు. దీంతో భర్త మిత్రుడైన వినయ్‌ను ఇంటికి వెళ్లి చూడమని రజిత కోరింది. వినయ్ బుధవారం వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరిచి చూడగా వెంకటేశ్వరరావు తాడుతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

200 కేజీల గంజాయి స్వాధీనం




నందిగామలో పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

నందిగామటౌన్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ డీసీపీ మహేశ్వరరాజు పేర్కొన్నారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో పట్టుబడిన గంజాయిని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీసీపీ విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖపట్నం నుంచి విజయవాడ, హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై నిఘాను కట్టుదిట్టం చేయటంతో పాటు వాహనాల తనిఖీ నిర్వహించామని తెలిపారు. ఈ క్రమంలోనే నందిగామ పట్టణంలోని వై జంక్షన్ సమీపంలోని ఇళ్ల మధ్య కారు నిలుపుదల చేసి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారన్నారు. పోలీసులు అక్కడకు చేరుకుని కారును పరిశీలించి 120 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదే విధంగా జగ్గయ్యపేట మండలం గౌరవరం వద్ద పంట పొలాల్లో వదిలి వెళ్లిన కారులో 80 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. డ్రోన్, సీసీ కెమెరా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్లు వదిలి పరారైన నిందితులను పట్టుకునేందుకు ముమ్మర గాలింపుతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే నిందితులను అదుపులోకి తీసకుంటామని చెప్పారు. నందిగామ ఏసీపీ తిలక్ మాట్లాడుతూ పట్టుబడిన 200 కేజీల గంజాయి విలువ సుమారు రూ.25 లక్షల వరకు ఉంటుందన్నారు. సమావేశంలో సీఐలు వైవీఎల్ నాయుడు, చౌహాన్, ఎస్ఐలు పాల్గొన్నారు.

విశాఖ మార్గంలో పలు రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని జరుగుతున్న ట్రాఫిక్ నిర్వహణ పనుల్లో భాగంగా పలు రైళ్లలను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు. ఈ నెల 11న కాకినాడ పోర్టు – విశాఖపట్నం (17267/17268), ఈ నెల 12న గుంటూరు – విశాఖపట్నం(17239/17240) రైళ్లు రద్దు చేశామన్నారు.

ప్రియుడితో కలిసి తల్లిని హత్య చేసిన కుమార్తె



ఎస్తేరు మృతదేహం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్నతల్లిని కుమార్తే ప్రియుడితో కలిసి హతమార్చింది. కొండపల్లి ఖిల్లా రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. కేసు వివరాలను వెస్ట్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు బుధవారం రాత్రి వెల్లడించారు. మైలవరం మండలం కొత్తగూడేనికి చెందిన కుంచాల యోహాన్, ఎస్తేరు(60) దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహాలు చేశారు. యోహాన్ ఏడాది క్రితం మృతి చెందాడు. చిన్న కుమార్తె బత్తుల జీవమణి తన భర్తను వదిలేసి తల్లి దగ్గర ఉంటోంది. ఆమె మైలవరానికి చెందిన అవివాహితుడైన ప్రియుడు షేక్ నాగూర్ వలితో వివాహేతర సంబంధం నడుపుతోంది. దీని గురించి తల్లి పలుమార్లు కుమార్తెను హెచ్చరించింది. తమ సంబంధానికి తల్లి అడ్డొస్తోందని ఎస్తేరును హతమార్చడానికి జీవమణి ప్రియుడితో కలిసి పథకం వేసింది. కొండపల్లి ఖిల్లా రోడ్డులో నిర్మిస్తున్న చర్చిని చూసేందుకు మంగళవారం రాత్రి వచ్చిన ఎస్తేరు అక్కడే నిద్రించింది. ఈ విషయం తెలుసుకున్న జీవమణి ప్రియుడితో కలిసి వచ్చి తల్లిపై పథకం ప్రకారం బలమైన ఆయుధంతో దాడి చేసి పరారయ్యారు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇన్‌చార్జ్ సీఐ గురుప్రసాద్, ఎస్ఐ పాపారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ లభించిన ఆధారాలతో హత్య చేసింది జీవమణి, నాగూర్‌వలి అని నిర్ధారణకు వచ్చారు. వారిద్దరు కొండపల్లి ఐడీఏ వద్ద ఉన్నట్లు సమాచారంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎస్ఐ విజయలక్ష్మి, పాల్గొన్నారు.